క్లుప్తంగా

వసతిగృహాల సందర్శన



దేవుపల్లిలోని వసతిగృహన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్, తదితరులు

బొండపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంతో పాటు దేవుపల్లిలోని బీసీ బాలికల వసతిగృహన్ని గజపతినగరం ఫస్ట్ క్లాస్ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్ రాజ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం వసతిగృహాధికారులతో మాట్లాడుతూ.. వసతిగృహంలో విద్యార్థినులు ఎంతమంది ఉన్నారు.. వారికి అందిస్తున్న సౌకర్యాలు.. ఇంకా ఏయే సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నదానిపై ఆరా తీశారు. మెను ప్రకారం భోజనాలు పెడుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది కె.సాయికిషోర్, తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే విద్యారంగ అభివృద్ధి



విద్యాసామగ్రి కిట్లు అందజేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

దత్తిరాజేరు: మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి హయాంలోనే విద్యారంగం ఎంతో అభివృద్ధి చెందిందని గడసాం వైఎస్సార్‌సీపీ నాయకుడు నేతేటి వెంకటరమణ అన్నారు. గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు శుక్రవారం విద్యాకిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అశ్రు నివాళి..



నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు, లెక్చరర్లు

శృంగవరపుకోట: అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది శుక్రవారం నివాళులర్పించారు. ఎన్‌సీసీ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ ఈరన్న ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు కొవ్వొత్తులు వెలిగించి, వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.


కనకమహాలక్ష్మి సన్నిధిలో జడ్జి



జిల్లా జడ్జి బబితను ఆశీర్వదిస్తున్న అర్చకులు

చీపురుపల్లి: మండల కేంద్రంలోని కనక మహాలక్ష్మి అమ్మవారిని జిల్లా జడ్జి ఎం.బబిత శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలకగా.. అర్చకులు వేదమంత్రాలతో అమ్మవారి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఆమె వెంట డీఎల్ఎస్ఏ కార్యదర్శి కృష్ణ ప్రసాద్, చీపురుపల్లి జెడ్పీ ఎఫ్ఏసీ పి.బుజ్జి ఉన్నారు. అనంతరం చీపురుపల్లి కోర్టు నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..



బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శ్రీనివాసరావు

లక్కవరపుకోట: మండల పరిధిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు అన్నారు. మండల తహసీల్దార్‌గా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. మెంటాడ నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. శ్రీనివాసరావుకు కార్యాలయం సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

సామూహిక అక్షరాభ్యాసం



రామాలయంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న సిబ్బంది

శృంగవరపుకోట: మండలంలోని వెంకటరమణపేటలో ఐసీడీఎస్ అధికారుల నేతృత్వంలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. గ్రామంలోని రామాలయంలో ఐసీడీఎస్ సిబ్బంది చిన్నారులతో సరస్వతీదేవి పూజ జరిపించి, అనంతరం అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓ అచ్యుతాంబ, సెక్టార్ సూపర్‌వైజర్లు, వెంకటరమణపేట అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిన్నారులు, తల్లులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తల్లికి వందనం కష్టాలు..

- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న తల్లిదండ్రులు
- సమాధానం చెప్పేందుకు సిబ్బంది కరువు
- విద్యార్థులే జాబితాలు చూసుకున్న వైనం
- జగనన్న హయాంలో కనిపించని ఈ తరహా కష్టాలు



వివరాలు తెలుసుకునేందుకు వచ్చి సచివాలయంలో ఎవ్వరూ లేకపోవడంతో కూర్చున్న తల్లిదండ్రులు



జాబితా చూసుకుంటున్న విద్యార్థి



సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

చీపురుపల్లి: నీకు పదిహేను వేలు.... నీకు పదిహేను వేలు..... అంటూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ఊదరగొట్టారు. అంతేకాదు తల్లికి వందనం పేరుతో ఇంటిలో ఎంత మంది పిల్లలున్నా ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని సాక్షాత్తూ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం ఎన్నికల ప్రచారంలో వెల్లడించడమే కాదు మేనిఫేస్టోలో కూడా పొందుపరిచారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది తర్వాత పథకం అమలుకు నిధులు విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం వెల్లడించారు. ఇదిలా ఉంటే తల్లికి వందనం పథకంలో అర్హులు, అనర్హుల జాబితాలను గ్రామ సచివాలయాల్లో పొందుపరిచారు. అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు జమ చేస్తున్నట్లు చెప్పారు. అయితే అర్హులు ఎవరో.. అనర్హులు ఎవరో తెలియక తల్లిదండ్రులు గ్రామ సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం పరిధిలో ఉన్న గ్రామ సచివాలయానికి తల్లిదండ్రులు తమ వివరాలు తెలుసుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అయితే ఆ సమయంలో సచివాలయంలో ఒక్క ఉద్యోగి కూడా లేకపోవడం గమనార్హం. దీంతో కొంతమంది విద్యార్థులే సచివాలయ ఉద్యోగుల కుర్చీల్లో కూర్చుని జాబితాలు చూసుకోవడం కనిపించింది. పిల్లలు లేకుండా వచ్చిన తల్లిదండ్రులు ఏమి చేయాలో తెలియక వెనుదిరిగారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సచివాలయంలో ఉద్యోగులు లేకపోవడంతో తల్లిదండ్రులు అసహనానికి గురయ్యారు. కనీసం సమాధానం చెప్పడానికి కూడా ఎవ్వరూ లేకపోవడం దారుణమని కొంత మంది తల్లిదండ్రులు వాపోయారు.

అస్తవ్యస్తంగా అర్హుల జాబితాలు



పేరు తొలగించారని వాపోతున్న రెల్లిగౌరమ్మపేట గ్రామానికి చెందిన దళిత మహిళా జి.కుమారి

లక్కవరపుకోట: తల్లికి వందనం పథకం అర్హుల జాబితాలు అస్తవ్యస్తంగా ఉండడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గల 23 సచివాలయాల పరిధిలో సుమారు 7 వందలకు పైగా విద్యార్థులపై అనర్హత వేటు వేశారు. ఎక్కువ శాతం మంది విద్యార్థుల తల్లిదండ్రులు నెలకు 3 వందల యూనిట్ల విద్యుత్ వినియోగించారనే కారణంతో పేర్లను తప్పించారు. నెలకు కనీసం 70 నుంచి 90 యూనిట్ల వరకు అయినా విద్యుత్‌ను వినియోగించమని, అలాంటిది తమ పేర్లు ఎలా తొలగిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఎవ్వరిని అడిగినా తమకు తెలియదని చెబుతున్నారని వాపోతున్నారు. మండలంలోని రెల్లిగౌరమ్మపేట గ్రామానికి చెందిన దళిత మహిళా గొటివాడ కుమారి తన ముగ్గురు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తోంది. అయితే 300 యూనిట్ల విద్యుత్ వినియోగించారనే కారణంతో ఆమెను అనర్హత జాబితాలో పొందుపరిచారు. లేనిపోని కారణాలు చెప్పి పేర్లు తొలగించడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఘనంగా వలిరెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు వరహాలనాయుడు, వంశీకృష్ణ, తదితరులు

చీపురుపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అలాగే పట్టణంలోని కనక మహాలక్ష్మి దేవస్థానంలో పూజలు నిర్వహించారు.

మండలంలోని పీకే పాలవలసలో వైద్య శిబిరం నిర్వహించి 200 మంది రోగులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోరుకొండ దాలయ్య, ఇప్పిలి రాము, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్, ప్రభాత్, కె.రామకృష్ణ, నాగచైతన్య, వెంకీ, బుంగ సంతోష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఇందిర

వేపాడ: మండల సివిల్ సప్లైస్ డీటీగా కె.ఇందిర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ ఆఫీస్ నుండి ఈమె బదిలీపై వచ్చారు. వేపాడ, కొత్తవలస మండలాల డీటీగా ఇందిర వ్యవహరించనున్నారు.

ఏఓగా కిరణ్‌కుమార్..



కిరణ్‌కుమార్

గజపతినగరం: మండల వ్యవసాయశాఖ అధికారిగా పి.కిరణ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జామి మండల ఏఓగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఏఓగా పనిచేసిన సీహెచ్ ధనలక్ష్మికి విజయగనగరం జేడీ కార్యాలయానికి బదిలీ జరిగింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వ్యవసాయ రంగంలో మెరుగైన ఫలితాలు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు.

• విత్తనశుద్ధి తప్పనిసరి

- వ్యవసాయశాఖ జేడీ రామారావు



విత్తనాల పంపిణీని పరిశీలిస్తున్న జేడీ రామరావు

బొండపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేపట్టేవారు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని వ్యవసాయశాఖ జేడీ వీటీ రామారావు అన్నారు. మండలంలోని గొట్లాం రైతుసేవా కేంద్రంలో శుక్రవారం రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విత్తనశుద్ధికి అవసరమైన సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్ మందును విత్తనాలతో పాటు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రైతులు మందు తీసుకుని విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. అలాగే పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు రాయితీపై విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ కె.మహరాజన్, ఏఓ పీవీ మల్లికార్జునరావు, వ్యవసాయశాఖ సిబ్బంది సంతోష్, ప్రియదర్శిని, సిరి చందన, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో అనారోగ్యాలకు చెక్



యోగాసనాలు వేస్తున్న వివిధ శాఖల సిబ్బంది

వేపాడ: ప్రతి రోజూ యోగా చేయడం వల్ల అనారోగ్యాలకు చెక్ పెట్టవచ్చని ఎంపీడీఓ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది, వీఓఏలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, ఉపాధి క్షేత్ర సహాయకులు హాజరై యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తవలస: మండల కేంద్రంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్ బ్రేకర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఇమంది అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వసంత్ విహార్, 202 కాలనీ, రెల్లి కాలనీ, మంగళపాలెం, దేశపాత్రునిపాలెం, శీరంశెట్టిపాలెం, తాడివానిపాలెం, గొల్లపేట, చింతలపాలెం గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డుపైనే నీరు..



చిన్నపాటి వర్షానికి కూడా గజపతినగరం మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి నుంచి మెంటాడ వెళ్లే రహదారిపై నీరు నిలిచిపోతోంది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి నీరు పోయేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– గజపతినగరం రూరల్

పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తా..

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి కర్రి శ్రీను



జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును సత్కరిస్తున్న కర్రి శ్రీను, తదితరులు



మాజీ ఎమ్మెల్యే కడుబండికి బొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతున్న కర్రి శ్రీను

కొత్తవలస: వైఎస్సార్‌సీపీ పూర్వ వైభవానికి కృషి చేస్తానని రాష్ట్ర వలంటీర్ల విభాగం ప్రధాన కార్యదర్శి, కొత్తవలస మండల పరిషత్ వైఎస్ ఎంపీపీ కర్రి శ్రీను అన్నారు. తనపై ఎంతో నమ్మకంతో పార్టీ ముఖ్యమైన బాధ్యతలను అప్పగించిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును.. కొత్తవలస మండలం అర్ధన్నపాలెం గ్రామ సమీపంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పదవి తనకు కేటాయించేందుకు గాను మజ్జి శ్రీనివాసరావు, కడుబండి శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, సత్కరించారు. పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కష్టపడి పనిచేస్తానని ఈ సందర్భంగా కర్రి శ్రీను తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొరపల్లి జయప్రకాష్, మచ్చ ఎర్రయ్యరామస్వామి, పెదిరెడ్ల వెంకటసత్యనారాయణ, పీఎస్ఎన్ పాత్రుడు, లెంక వెంకన్నపాత్రుడు, లెంక నర్సింగరావు, భాస్కర్‌పాత్రుడు, కర్రి దేముడు, శ్రీనివాసరావు, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొరత ఉండకూడదు..



రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

దత్తిరాజేరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రం వద్ద ఏఓ అనురాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరితో కలిసి రైతులకు శుక్రవారం విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రకాల విత్తనాలు సిద్ధం చేసి రైతులకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ డోల చంద్రమ్మ, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, నాయకులు ఫణీంద్రుడు, త్రినాథ్, బంగారు నాయుడు, ఈశ్వరరావు, బండి కృష్ణ, సత్యారావు, గౌరినాయుడు, ఏఈఓ నీలాకృష్ణ, వీఏఏ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

• కుళాయిల ఏర్పాటు



కుళాయిలను ప్రారంభిస్తున్న సర్పంచ్ జమ్ము శ్రీదేవి, అప్పలనాయుడు

గుర్ల: మండలంలోని చింతపల్లిపేట శ్మశానంలో నీటి సదుపాయం లేకపోవడంతో అంత్యక్రియలు చేసే సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. సమస్య తెలుసుకున్న సర్పంచ్ జమ్ము శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు జమ్ము అప్పలనాయుడు రూ.1.40 లక్షలతో జగనన్న కాలనీకి, శ్మశానానికి కొత్త పైపులైన్ వేసి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఈ కుళాయిలును వారు శక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు లెంక ఈశ్వరమ్మ, సూర్యనారాయణ ఉన్నారు.

• మరీ ఇంత నిర్లక్ష్యమా..!





రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆస్పత్రులకు మందులు పంపిణీ చేస్తుంటే వాటిని భద్రపరచాల్సిన వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో లక్షల రూపాయల విలువైన మందులు పాడైపోతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో మందులను నిల్వ చేసేందుకు తగినంత స్థలం లేకపోవడంతో వరండా, నడక దారి, ఇలా ఎక్కడబడితే అక్కడ మందులు పడేశారు. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎటుచూసినా మందుల బాక్సులే కనిపిస్తుండడంతో రోగులకు కనీసం కూర్చునేందుకు కూడా స్థలం లేకుండా పోయింది. ఈ విషయమై ఆర్ఎంఓ కిరణ్ వద్ద ప్రస్తావించగా... స్టోర్ రూమ్ నిండిపోవడంతో ఆరుబయట మందులు నిల్వ చేసిన మాట వాస్తవమేనన్నారు. నూతన భవనాలు ప్రారంభమైతే సమస్య ఉండదని చెప్పారు.

– గజపతినగరం రూరల్



